# ఫ్లాష్ బ్యాక్



పాతసినిమాలకు సంబంధించిన విశేషాలు.. నటీనటుల గురించి, సినిమాల గురించి, సాంకేతిక నిపుణుల గురించి.. వగైరా..వగైరా. ప్రతినెలా ఓసారి అలనాటి సినీరంగంలోకి తొంగిచూద్దాం

## కుటుంబరావు ఆత్మకు శాంతి

### - ఆరుద్ర.

### (రూపవాణి, అక్టోబర్ 1945 సంచిక నుంచి)



**ఆత్మీయుడూ, అందులోకీ** తెలుగుదేశానికి కావలసిన వాడూ హఠాత్తుగా చనిపోయాడన్న వార్తకన్నా హృదయ విదారకమైనది ఇంకోటి ఉండదు. రాళ్ళబండి కుటుంబరావు మృతి కొన్నిగంటలసేపు తట్టుకోలేని 'షాక్ ' అతడికి నా శ్రద్ధాంజలి.

రాళ్ళబండిలాంటి నటులు భౌతికంగా చనిపోయినా, నాలుగు కాలాలపాటు నలుగురి జ్ఞాపకాలలోనూ సజీవంగా బ్రతుకుతారు. అతడు నటించిన కొద్ది చిత్రాల నెగిటివులు క్షేమంగా ఉన్నంతకాల అతణ్ణి మనం సజీవంగానే చూడగలం. సజీవంగా నటించగలిగిన కొద్దిమంది నటకులలో అతడొకడు.

కల్లా కపటంలేని మనిషి, ముఖస్తుతి చెయ్యడం సుతరాము తెలియనివాడు. తనకు రైటని తోచిన విషయాన్ని పుల్లవిరిచి పొయ్యిలో పెట్టినట్టు నిస్సంకోచంగా చెప్పగలిగిన ధీమాగలవాడు రాళ్ళబండి. అతడితో కొద్దిపాటి పరిచయంగల వాళ్ళే ఈ ప్రత్యేకతలని అతనితో చప్పున పోల్చుకునేవారు.

రాళ్ళబండితో నాకు పరిచయం గలిగినప్పుడు, అతను వ్యాధిగ్రస్తుడు. రోజూ అధమం నూటరెండు డిగ్రీల జ్వరంతో బాధపడేవాడు. భాద్రపద మాసపు వాన మేఘాలలాంటి దగ్గుతెరలు అతడి గొంతుకని క్రమ్ముకునేని. అయినా అతడు

గంభీరంగా రోగాన్ని ఎదుర్కొనేవాడు. వ్యాధితోనూ, మృత్యువుతోనూ, 'ద్రోహి' చిత్రంలో తను అద్భుతంగా అన్న "నాకు తీరికేదీ?" అన్నమాటలే అంటున్నట్టు ఉండేవాడు.

తన బాధని మరిచిపోయేందుకు అంత జ్వరంతోనూ  నలుగురి స్నేహితులతో పనిపెట్టుకుని కొన్ని గంటలసేపు పిచ్చాపాటీ మాట్లాడేవాడు. ఒక నెలా పదిహేను రోజులు ఇద్దరం కలుసుకునేవాళ్ళం. ఆ రోజులలో అతడు చెప్పిన రకరకాల విషయాలలో చాలా గ్రంథస్థం చేయవలసినవి ఉన్నాయి. ఉదాహరణకి నాటకాల గురించి చెపుతూ రంగం మీదా, నేపథ్యంలోనూ బళ్ళారి రాఘవాచార్యులు గారి సద్యస్ఫూర్తి.

అతడు చేసిన ప్రతి పనినీ హృదయ పూర్తిగా ఇది నాది అన్న భావంతో చేసేవాడు. అతడు పనిచేసిన ఒకానొక సంస్థకి డబ్బు పెట్టిన ఒకాయన “'నా' చిత్రం ఎంతదాకా వచ్చింది?” అంటే కుటుంబరావు మండిపడి "ఎవరిది? మేమంతా కష్టపడి పనిచేస్తే 'నా' చిత్రమంటావేం? ఇది మా చిత్రం" అన్నాడు. ఈ  ఒక్క సంఘటన చాలు అతడి స్వాంతంత్ర్య ప్రియత్వాన్ని చెప్పడానికి.

చనిపోవడానికి కొన్ని రోజుల ముందు ఒక స్నేహితుడికి ఉత్తరం రాస్తూ "బతికి బయటపడతానన్న నమ్మకం లేద"ని అతడంటే వ్యాధితెచ్చే నిరుత్సాహంలో రాసిన మాటలలో అనుకోడమే అయింది. ఇంతలో ఇలా అవుతుందని అనుకోడానికి ఎక్కడా ఆస్కారంలేదు.

'ధర్మాంగద' అతని ఆఖరు చిత్రం. అందులో అతడి నటన చూసి మనం కంట తడిపెడతాం. గానీ, ఆ చిత్రాన్ని తీసిన సంస్థ వాళ్ళు ఒక్క పనిచేస్తే (త్యాగమనే అందాం) కనీసం విద్యుక్తధర్మాన్ని నిర్వర్తించారని సంతోషిద్దాం. 'ధర్మాంగద' విడుదల అయాక ప్రతి ఊళ్ళోనూ ఒకనాటి రాబడిని ప్రోగుచేసి అతడి కుటుంబానికి ఇవ్వడం నిజంగా అతని మృతికి సంతాపాన్ని అతని కుటుంబానికి సానుభూతినీ తెలియచేయడం అవుతుంది.

ఈనాడు కొన్ని చోట్ల మొదటిసారి, అక్కడక్కడ రెండోసారి "ద్రోహి" కూడా ప్రదర్శించబడుతున్నది. ఆ చిత్రం వల్ల ఒకనాటి రాబడిని కూడా స్వతంత్రా పిక్చర్సు వారు కుటుంబరావు కుటుంబానికి ఇవ్వడం సముచితమైన సానుభూతి ప్రకటన.

**రాళ్ళబండి కుటుంబరావు అస్తమయం**

బందరులో సెప్టెంబరు 12 వతేదీ రాత్రి కాలధర్మం చెందాడు.. అకాలంగా. పాపం అతడి ఇద్దరు ఆడపిల్లలూ, ముగ్గురు మగపిల్లలూ భార్యతోపాటు యీ దుఃఖాన్ని యావదాంధ్ర ప్రేక్షకలోకమూ, అతని బంధుమిత్రాదులు పంచుకోవలసిన విషాద పరిస్థితి యేర్పడింది.

జననం: గుడివాడ తాలూకా బల్లిపర్రు గ్రామం. 3వ ఫారంతోనే చదువు నిలిపివేసి సంసార నిర్వహణలో నిమగ్నుడవవలసి వచ్చింది. అప్పుడే నాటకాల మోజు హెచ్చింది. తానీషాగా రంగభూమిపై ప్రకాశించిన నట శిఖామణి

40 ఏళ్ళ వయసులో 'మీరాబాయి'లో భాను సింహుడుగా, వెండితెరపై ప్రథమ ప్రదర్శనం – 'ధర్మపత్ని'లో ఒక ప్రముఖ విలన్ పాత్రధారిగా ప్రత్యేక స్థానం ఆక్రమించి, చంద్రమోహన్, యాకూబ్, బాబురావ్ పంథార్కర్‌ల శ్రేణిలో నిలబడ్డాడు. తర్వాత 'పత్ని', 'ద్రోహి'లో అద్భుతంగా ఆ పాత్రలను జీవించాడు. ఇక అతడి కడపటి చిత్రం 'ధర్మాంగద' కుటుంబరావు తెరపై 'విలన్'గా నటించి కాలం చేశాడు. ఆ లోతును నింపగల నటుడు మళ్ళీ లభిస్తాడా అనేది సందేహాస్పదమే. కుటుంబరావు ఆత్మకుశాంతి.

Post your comments